క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

ప్యాపిలి: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తహసీల్దార్ భారతి, సీడీపీఓ షంషాద్ బేగం, వైద్యాధికారి రాహుల్ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ పోషణ మాసాన్ని నిర్వహించారు. బాలల ఆరోగ్యం, ఎదుగుదలలో తల్లి పాల ప్రాముఖ్యత ఎంతో ఉందని తెలపారు. తల్లిపాలతో శిశువుకు పోషణ లభించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అన్నం, పప్పు, కూరగాయలు, పండ్ల రసాలు, గుడ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు దేవకృపమ్మ, శకుంతల, శోభారాణి, పరమేశ్వరి, ఏపీఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళలకు పోషకాహారం తప్పనిసరి

బేతంచెర్ల: మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ సూచించారు. డ్రైవర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యురాలు ప్రియాంక ఆధ్వర్యంలో శుక్రవారం 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. వైద్యుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం వైద్యులు వృద్ధులు, చిన్నారులు, మహిళలను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది మల్లికార్జున, మధు, రమణ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకంలో జెడ్పీచైర్మన్ పూజలు



పూజల్లో పాల్గొన్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి దంపతులు

కొలిమిగుండ్ల: ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని పురాతన త్రిపురాంతకేశ్వరుని ఆలయంలో శుక్రవారం జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సరస్వతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన జెడ్పీచైర్మన్‌కు పురోహితులు స్వాగతం పలికారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత గురించి పురోహితులను అడిగి తెలుసుకున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం

కోవెలకుంట్ల: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి ఆర్థికసాయం అందింది. శుక్రవారం కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేఖర్ ఈ ఏడాది మే నెలలో విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఆళ్లగడ్డ వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. పోలీస్ శాలరీ ప్యాకేజీ అకౌంట్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కింద రూ. కోటి ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా స్థానిక బ్రాంచ్‌లో ఆ బ్యాంకు ఏజీఎం సూర్యప్రకాష్, చీఫ్ మేనేజర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ భార్య ప్రవల్లికకు చెక్కును అందజేశారు.

నేడు శంకరానందగిరి గురూజీ రాక

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన కాళికామాత నాగలింగేశ్వరస్వామి ఆలయానికి శనివారం శంకరానందగిరి గురూజీ వస్తున్నట్లు ఆలయ అర్చకుడు రాఘవాచారి తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కోడూరులోని శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమ పీఠాధిపతి శంకరానందగిరి గురూజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు. పట్టణంలోని భక్తులు హాజరై స్వామివారి కృపకుపాత్రులు కావాలని కోరారు.



ప్రమాదకరంగా ఉన్న మలుపు



మలుపు వద్ద ప్రమాదానికి గురైన ఆటో (ఫైల్)

మలుపుల ప్రయాణం.. తరచూ ప్రమాదం

అవుకు(కొలిమిగుండ్ల): చెర్లోపల్లె సమీపంలోని గాలేరు నగరి వరద కాల్వ నుంచి అవుకు రిజర్వాయర్ దిగువ వరకు ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. తరచూ ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రామాపురానికి చెందిన ఆటో అవుకు వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న బులెరో జీపు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. ఓవైపు రిజర్వాయర్ మరోవైపు కొండ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద కాల్వ సమీపం నుంచి ఉప్పలపాడు దారి వరకు నాలుగు కిలోమీటర్ల పరిధిలో 15కుపైగానే మలుపులు ఉన్నాయి. మలుపుల వద్దకు వచ్చే సరికి వాహనాలు కనిపించక చాలాసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు మలుపుల వద్ద పడరాని పాట్లు పడుతున్నారు. బస్సు కటింగ్ అయ్యే సమయంలో ప్రయాణికులతో పాటు టికెట్లు వసూలు చేసే సమయంలో కండక్టర్లు కింద పడిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని మలుపుల వద్ద కొండ ప్రాంతాన్ని తొలగించేలా చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతాయని ఆయా గ్రామస్తులు, వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

హైటెన్షన్ టవర్ల ఏర్పాటుకు విముఖత



పవర్ గ్రిడ్ ఇంజినీర్లతో మాట్లాడుతున్న రైతులు



వరి మడిలో ఏర్పాటు చేసిన టవర్

కొలిమిగుండ్ల: విద్యుత్ హైటెన్షన్ టవర్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయరాదని అబ్దులాపురానికి చెందిన కొంత మంది రైతులు పట్టుబట్టారు. శుక్రవారం రైతులు పొలాల వద్దకు చేరుకుని సంబంధిత ఇంజినీర్లతో చర్చించి తమ అభిప్రాయాలను చెప్పారు. నందిపాడు-తిమ్మనాయునిపేట గ్రామాల మధ్యలో పవర్‌గ్రిడ్ ఏర్పాటవుతోంది. దీనికి 400 కేవీ హైటెన్షన్ టవర్లను అనంతపురం వరకు ఏర్పాటు చేస్తున్నారు. అబ్దులాపురంలో వరిమళ్ల మీదుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నలుగురు రైతులకు చెందిన పొలాల్లో నిర్మాణం చేపట్టారు. మిగిలిన రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టవర్ల ఏర్పాటు వల్ల ఇండక్షన్ వస్తుందన్నారు. వరి మళ్లలో నీళ్లు ఉండడంతో కూలీలు పనులకు రావాలన్నా ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. టవర్లు నిర్మాణం చేపట్టాక నష్టపరిహారం కింద చెక్కులు ఇస్తామని ఇంజినీర్లు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా చెక్కులు ఇచ్చాకనే పనులు మొదలు పెట్టుకోవాలని లేదంటే ఇక్కడ టవర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఖరాఖండిగా తేల్చిచెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు

కోవెలకుంట్ల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు రైతు విశ్రాంతి భవనంలో సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు, పశు సంవర్ధక సహాయకులు, వ్యవసాయ సెరికల్చర్ సహాయకులకు శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో పనిచేసే వ్యవసాయ, అనుబంధశాఖల సిబ్బంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు విచక్షణా రహితంగా వాడడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమేకాకుండా దిగుబడులు తగ్గే ఆస్కారం ఉందన్నారు. శిక్షణా తరగతులు మూడు రోజులపాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కోవెలకుంట్ల ఉప సంచాలకుడు సుధాకర్, ఆయా మండలాల ఏఓలు సుధాకర్‌రెడ్డి, జ్యోతి, ప్రమీల, కరీమునిషా, ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వదలని వర్షం.. సాగుకు ఆటంకం



లింగాల సమీపంలో మిరపలో చేరిన వర్షపునీరు

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. వచ్చే నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుండగా ఇటీవల కురుస్తున్న వర్షాలు రబీకి అనుకూలంగా మారినా ఖరీఫ్ సీజన్‌లో చివరి పంట జొన్న సాగుకు ఆటంకం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు, రసాయన ఎరువులు సమకూర్చుకుని విత్తనం వేసేందుకు సిద్ధం కాగా వర్షాలు వెంటాడుతుండడంతో జొన్న సాగు ముందుకు సాగడం లేదు. పొలాల్లో వర్షపునీరు చేరడంతో జొన్న పంట సాగు నిలిచిపోయింది. ఈ నెలాఖరుతో ఖరీఫ్ ముగియనుండగా విత్తన ప్రక్రియకు బ్రేక్ పడింది.

బేతంచెర్లలో మోస్తరు వర్షం

బేతంచెర్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా ఆయా గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా సజ్జ, కొర్ర, మొక్కజొన్న పంటల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

సబ్సిడీ శనగ విత్తనాల కోసం నిరీక్షణ

కొలిమిగుండ్ల: ఆశించిన మేర వర్షాలు కురవడంతో రైతులు ఇప్పటికే పొలాలను దుక్కులు దున్నుకుంటున్నారు. శనగ సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను అందించాల్సి ఉంది. అయితే ఇంత వరకు విత్తనాల ఊసే లేకపోవడంతో ఎప్పుడు పంపిణీ చేస్తారా అని నిరీక్షిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలో ఏటా 10 వేల ఎకరాల్లో శనగ సాగు చేస్తుంటారు. మండలానికి 3200 క్వింటాళ్ల శనగలు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం శనగలకు ఎంత మేర సబ్సిడీ ఇస్తుందో ఇప్పటి వరకు ప్రకటించలేదు. విత్తనాలు సరఫరా చేసుంటే ఇప్పటికే కొంత మంది శనగ సాగు చేసుండేవాళ్లని రైతులు పేర్కొంటున్నారు. రాయితీ ఎంత ఇస్తారు..ఎప్పుడు విత్తనాలు పంపిణీ చేస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వ్యవసాయ అధికారులు అక్టోబర్ 5వ తేదీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. సకాలంలో రాకపోతే బయట కొనుగోలు చేసి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

టీకాలు వేయడంలో నిర్లక్ష్యం వద్దు



పశువైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

సంజామల: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ సమయంలో పాడిరైతులకు పశువైద్య సిబ్బంది అండగా ఉండాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటి డైరెక్టర్ రమణయ్య అన్నారు. సంజామలలో పశుఏరియా ఆస్పత్రిలో కొలిమిగుండ్ల, సంజామల మండలాల పశువైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని.. నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏడీ కొండారెడ్డి, పశువైద్యుడు కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు పరిశ్రమలపై అవగాహన



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం

బేతంచెర్ల: ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని వినియోగించుకుని నిరుద్యోగ యువతీ, యువకులు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని నంద్యాల జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమం జరిగింది. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు లభిస్తాయని తెలిపారు. స్లాబ్స్, పౌడర్, గార్మెంట్స్, వెల్డింగ్, ప్లాస్టిక్ యూనిట్లకు 45 శాతం రాయితీ రుణాలు లభిస్తాయని చెప్పారు. ఎంఎస్ఎంఈ సర్టిఫికెట్ పొందే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో డోన్ పరిశ్రమల అధికారి శివ ప్రసాద్, ఎంఎస్ఎంఈ కో ఆర్డినేటర్లు కృష్ణమూర్తి, వెంకటరమణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కంపమల్ల వీఆర్ఏ మృతి



కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న వీఆర్ఏల సంఘం నాయకులు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లకు చెందిన రెవెన్యూ గ్రామ సహాయకురాలు నారాయణమ్మ(56) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు శివరాముడు, నాయుడు, దేవఉసేని, వెంకరమణ, నాగరాజు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం సంఘం తరఫున కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

అమ్మవారి సేవలో కాటసాని

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కొండపేట వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని లలిత త్రిపురసుందరిగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నేతలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వాసవీమాత తులాభారంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం నేతలు వారికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. గాథంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, గుండా రవికుమార్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



కాటసాని రామిరెడ్డి, ప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



కోవెలకుంట్ల: ధనలక్ష్మీగా వాసవీమాత



కోవెలకుంట్ల: గుద్దేటివీధిలో మహాలక్ష్మీగా..



బేతంచెర్లలో మహాలక్ష్మీ దేవిగా వాసవీమాత



నందవరంలో స్కంధ మాతగా చౌడేశ్వరిదేవి



మద్దిలేటిస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి

నేత్రపర్వం.. అమ్మదర్శనం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, వేదపారాయణాలు, ఊరేగింపులతో కార్యక్రమాలు వైభవంగా సాగాయి. కోవెలకుంట్లలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు ధనలక్ష్మీ రూపంలో కనువిందు చేశారు. అదే విధంగా స్థానిక మారెమ్మ, ప్రసన్నభారతీమాత, మూలమ్మ ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు. బేతంచెర్లలో అమ్మవారు మహాలక్ష్మీగా పూజలందుకున్నారు. గౌరిపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో గజ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరిగింది. మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. శ్రీవారి పల్లకి ఊరేగింపు, సహస్రదీపాలంకరణ సేవలు కనుల పండువగా జరిగాయి. బనగానపల్లె మండలం నందవరం చౌడేశ్వరిదేవి స్కంధ మాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్యాపిలిలో వాసవీమాత లలితా త్రిపురసుందరీ దేవిగా పూజలందుకున్నారు. అవుకులో అన్నపూర్ణదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. డోన్ పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని లక్ష్మీదేవి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



ప్యాపిలిలో..



అవుకులో..



సంజామలలో..



డోన్ పాతబస్టాండ్‌లో..

ఐకార్‌లో డోన్ విద్యార్థిని ప్రతిభ

డోన్ టౌన్: జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలో డోన్‌కు చెందిన కాశీం, ఖాజాబీ దంపతుల పెద్ద కుమార్తె డి.షర్మిల ఓబీసీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 42వ ర్యాంకు సాధించింది. ఆమె ప్రస్తుతం ఇడుపులపాయ సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా కళాశాలలో నాల్గో ఏడాది ఫుడ్ టెక్నాలజీ కోర్సు చదువుతోంది. జూలైలో ఈ పరీక్ష జరగగా సెప్టెంబర్ 15న ఫలితాలు విడుదలయ్యాయి.